ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
బుధవారం 19 మార్చి 2025
ఉష్ణోగ్రత: గరిష్ఠం 39.9 కనిష్ఠం 17.7


రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (బుధవారం సాయంత్రం)
సహర్: 4:59 (గురువారం ఉదయం)

ఈసారైనా!



ఉమ్మడి జిల్లాపై వరాలు కురిసేనా?.. నేడే రాష్ట్ర బడ్జెట్

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై ఎన్నో ఆశలు
- నెరవేరని శాటిలైట్ టౌన్‌షిప్‌ల కల
- పింఛన్ల పెంపుపై గంపెడాశలు
- మెట్రో విస్తరణకు నిధులు కేటాయించేనా?
- ఫ్యూచర్‌సిటీపైనే ప్రభుత్వం ఫోకస్





రాష్ట్ర ప్రభుత్వం నేడు (బుధవారం) అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈసారి ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనైనా ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యమిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నో హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మొదటి ఏడాది పాలనలో అన్ని హామీలను నెరవేర్చని విషయం తెలిసిందే. ఆర్థిక ఇబ్బందుల కారణంగా దశలవారీగా హామీలను నెరవేరుస్తున్నామని, ఈ ఏడాది బడ్జెట్‌లో మిగతా హామీలన్నింటికీ కేటాయింపులు చేస్తామని ప్రభుత్వం చెబుతూ వస్తోంది. దీంతో ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లోనైనా గతంలో ఇచ్చిన హామీలన్నింటికీ సర్కారు పరిష్కారం చూపుతుందని అందరూ ఆశపడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో ఎన్నో ఏళ్లుగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం పలు పెండింగ్ సమస్యల విషయంలో అరకొర నిధులే కేటాయిస్తున్నాయి. దీంతో అనేక పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో సింహభాగం ఉమ్మడి జిల్లా నుంచే వస్తున్నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధికి సంబంధించి నిధులు కేటాయించే విషయంలో ప్రభుత్వాలు చిన్నచూపే చూస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాకు తాగు, సాగునీరు అందించేందుకు వైఎస్ హయాంలో గోదావరి జలాలను తరలించేందుకు చేవెళ్ల- ప్రాణహిత ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అయితే రాష్ట్రవిభజన తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా ఈ డిజైన్ మార్చింది. ఉమ్మడి జిల్లాకు పాలమూరు- రంగారెడ్డిజిల్లా ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణ జలాలను తరలించేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందుకు సంబంధించిన

మిగతా 7వ పేజీలో...

మెట్రో విస్తరణకు నిధులు ఎలా?



నగర శివార్లలోని ఫ్యూచర్‌సిటీతో పాటు శంషాబాద్ ఎయిర్‌పోర్టు, మేడ్చల్, శామీర్‌పేట, హయత్‌నగర్ వరకు మెట్రో రైల్ విస్తరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన రూట్ మ్యాప్ కూడా విడుదల చేసింది. అయితే నిర్మాణ పనులకు నిధులు ఎలా సమకూరుస్తారనేది ఇంకా స్పష్టత రాలేదు. ఈ నిర్మాణానికి చేయూతనివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖరాసినా ఇంత వరకు అతీగతీలేదు. గత బడ్జెట్‌లో మెట్రో విస్తరణకు రూ. 100 కోట్లు కేటాయించారు. ఇవి ఏ మూలకు సరిపోవు. ఈ బడ్జెట్‌లో సర్కార్ ఎంత నిధులు కేటాయిస్తుందనేది నేడు తేలనుంది.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్వీట్లు తినిపిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లు
చరిత్రాత్మకం

ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ మహేందర్‌రెడ్డి

తాండూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేశంలోనే తొలిసారిగా బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు శాసన మండలిలో ఆమోదం పొందడం చరిత్రాత్మకమైన ఘట్టమని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలిలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందనడానికి ఈ బిల్లులు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు అవసరమైన అన్నింటిని ప్రజా ప్రభుత్వం చేస్తుందని చెప్పారు.

సాసర్ పిట్లను నింపి
పక్షుల దాహం తీర్చాలి



జినుగుర్తి వద్ద బోర్‌వెల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తాండూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పక్షుల దాహం తీర్చేందుకు సాసర్ పిట్లను తాగునీటితో నింపాలని తాండూరు అటవీ రేంజ్ అధికారి శ్రీదేవి సరస్వతి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం తాండూరు మండలం జినుగుర్తి అటవీ క్షేత్రాన్ని సందర్శించారు. లింగమూర్తి ప్రాంతంలో బోర్‌వెల్‌ను పరిశీలించారు. బోర్వెల్ నుంచి సాసర్ పిట్‌లో నీటిని నింపేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అదే అటవీ క్షేత్రంలో లింగమూర్తి ఏరియాలోని సోలార్ బోరును పరిశీలించారు. సోలార్ పవర్ ద్వారా బోరు మోటారు నడుస్తుందా, మంచినీటి సౌకర్యం ఏ విధంగా ఉంది, ప్రస్తుతం అడవిలో జంతువులు సాసర్‌పిట్లలో నీటిని తాగుతున్నాయా, ఏ మేరకు అటవీ క్షేత్రంలో తిరుగుతున్నాయనే దాని కోసం ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఆమెవెంట సెక్షన్ అధికారి పీర్యానాయక్, బీట్ అధికారి మల్లయ్య తదితరులున్నారు.



8

పాంబండ దర్శనం..
పాప వినాశనం

● నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

ప్రశాంతంగా
ఇంటర్ పరీక్షలు

వికారాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. 7,388 మంది విద్యార్థులకు 7,210 మంది హాజరు కాగా, 178 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 6,146 మంది విద్యార్థులకు 6,011 మంది హాజరవగా 135 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,242 మంది విద్యార్థులకు 1,199 మంది హాజరయ్యారు.

ఎస్సీల ప్రగతికి పాటుపడాలి

షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్



రాంచందర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ గౌతమ్, రాచకొండ సీపీ సుధీర్‌బాబులు

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఎస్సీలు అందిపుచ్చుకొని మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడే వడ్డేపల్లి రాంచందర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు వచ్చిన సందర్భంగా కలెక్టర్ గౌతం పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం జాతీయ కమిషన్ డైరెక్టర్ జి.సునిల్ కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమల శాఖ నుంచి స్వయం ఉపాధి కోసం కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు ఔత్సాహిక ఎస్సీ యువతను ప్రోత్సహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. మెడిసిన్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్పులు ఆలస్యంతో విద్యార్థుల అడ్మిషన్లలో ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా ఎస్సీ వర్గాలకు కేటాయించిన మద్యం దుకాణాలను వారి కే అందించాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు జిల్లాలో ఎస్సీలకు అమలవుతు న్న పథకాల గురించి కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు, డీసీపీలు పద్మజ, కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ, ఆర్డీఓలు శ్యాంప్రకాష్, ఉపేందర్‌రెడ్డి, ఏసీపీలు పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలను
నియమించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు బూత్‌లెవల్ వారీగా బీఎల్‌వోలను నియమించుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. ఓటరు జాబితాలో సవరణ, ఫారం 6, 7, 8పై రాజకీయ నేతలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే ఆన్‌లైన్‌లో సవరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు కావాలని తెలిపారు. సమావేశంలో కొడంగల్ తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



మండుటెండల్లో జలకళ

మండుటెండల్లో చెక్‌డ్యాంలో నీరు జలజలా పారుతోంది. ధారూరు అడవిలో అటవీశాఖ ఆధ్వర్యంలో గతేడాది డిసెంబర్‌లో రూ.5.58 లక్షలతో నిర్మించిన చెక్‌డ్యాంలో ప్రస్తుతం నీరు తొణికిసలాడుతూ కనువిందు చేస్తోంది. దొంగలకుంట ప్రాంతంలో ఉన్న ఈ చెక్‌డ్యాంలో ఊట నీరు వచ్చి చేరడంతో వేసవిలోను జలప్రవాహం కనిపిస్తోంది. అడవి మధ్యలో ఉన్న ఈ చెక్‌డ్యాం మంగళవారం నిండుకుండలా కనువిందు చేసింది. వేసవిలో వన్యప్రాణులకు దప్పిక తీర్చుకోవటానికి ఈ చెక్‌డ్యాం ఎంతగానో ఉపయోగపడుతుంది.

- ధారూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి)



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా అధికారులు

పకడ్బందీగా 'పది' పరీక్షలు

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 69 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 12,903 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 20 మంది తహసీల్దార్లు, 20 మంది ఎంపీడీవోలు, 20 మంది ఎంఈవోలు, 69 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 69 డిపార్టమెంటల్ అధికారులు, ఎనిమిది మంది పోలీస్‌స్టేషన్ కస్టోడియన్స్, 13 రూట్ అధికారులు, 69 సెట్టింగ్ స్క్వాడ్స్, 10 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 732 ఇన్విజిలెటర్లు విధుల్లో ఉంటారన్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని 9.35 తర్వాత ఎవరికీ అనుమతి ఉండదన్నారు.జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, మరిన్ని వివరాలకు 08416 235245 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఎంఈవో రేణుకదేవి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల ఇష్టారాజ్యం

కిందిస్థాయి ఉద్యోగులదే హవా
ప్రతి పనికీ చేయి తడపాల్సిందే..

వికారాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. ఏళ్లుగా పాతుకుపోయిన కింది స్థాయి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఏదైనా పని నిమిత్తం సామాన్యుడు కార్యాలయానికి వెళ్తే ప్రతి పనికి కొంత రేటు కడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సిబ్బంది కార్యాలయంలో కంటే చెట్ల కిందనే ఎక్కువ మంతనాలు సాగిస్తున్నారు. ఎర్రమట్టి తవ్వకాలైనా.. ప్రభుత్వ భూముల కబ్జా అయినా కింది స్థాయి సిబ్బంది హస్తం లేనిదే జరగడం లేదని వికారాబాద్ కోడై కూస్తోంది.

అధికారుల సహకారంతోనే..!

మండల పరిధిలోని పీరంపల్లి, గిరిగేట్‌పల్లి, పాతూరు తోపాటు పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఎర్రమట్టి అక్రమాలకు రెవెన్యూ అధికారుల సహకారమే అని ప్రజలు చెబుతున్నారు. కొత్రేపల్లి సర్వే నంబర్ 164లో ప్రైవేటు వెంచర్ల కోసం 40 ఫీట్ల రోడ్డు కిలో మీటర్ల కొద్దీ వేస్తున్నా ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వీరి వద్ద ఓ అధికారి లక్షల్లో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఎన్నెపల్లిలోని సర్వేనంబర్ 88లో ఉన్న 30 గుంటల ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కుట్ర జరుగుతోంది. గొట్టిముక్లలో ఓ వెంచర్ నిర్వాహకుడు ప్రభుత్వ భూమి నుంచే రోడ్డు వేస్తున్నా పట్టించుకోవడం లేదు.

ఏం చేస్తారో చేసుకోండి!

ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెబుతుంటే రెవెన్యూ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రేషన్ కార్డుల్లో పేర్ల తొలగింపు, కుటుంబ సభ్యుల చేరికపై సేవలో దరఖాస్తు చేసుకొని తమ వద్దకు రావాలని సూచించిన అధికారులు ఆ తర్వాత తమ వద్ద ఆ ఆప్షన్ లేదని చేతులెత్తేస్తున్నారు. దీంతో రేషన్ కార్డు లబ్ధిదారులు చెప్పులరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కార్యాలయంలో రేషన్ కార్డు విభాగంలో హర్ష అనే అధికారి రేషన్ కార్డు లబ్ధిదారులకు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. కార్యాలయంలో అందుబాటులో లేకపోగా ఫోన్ చేస్తే ఫీడ్ లేని నంబర్లు ఎత్తనని అహంకారంగా వ్యవహరిస్తున్నాడు. ఏం చేస్తారో చేసుకోండి అన్నట్లుగా నిర్లక్షంగా సమాధానమిస్తున్నాడు.

ఎడిట్ ఆప్షన్ ఇంకా రాలేదు

రేషన్ కార్డులకు సంబంధించి ఎడిటింగ్ ఆప్షన్ ఇంకా మా వద్దకు రాలేదు. దీంతో కొంత మంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎడిటింగ్ ఆప్షన్ ఇచ్చిన తర్వాత మార్పులు, చేర్పులకు అవకాశం దొరుకుతుంది. కొత్రేపల్లి సర్వే నంబర్ 164లో 40 ఫీట్ల రోడ్డుకు సంబంధించి ఇప్పటికే నిర్వాహకులకు నోటీసులు పంపించాం.

- లక్ష్మీనారాయణ, తహసీల్దార్



వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా రేషన్ కార్డు విభాగం అధికారి కుర్చీ

ఆయిల్ పామ్ సాగుకు
అనుకూలం

మర్పల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉన్న భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని, అందుకే ఈ పంట సాగును ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని మర్పల్లి, మోమిన్‌పేట్, నవాబుపేట ఉద్యానవన శాఖ అధికారి అక్షితరెడ్డి అన్నారు. మంగళవారం మర్పల్లి మండలంలోని దామస్తపూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఎకరానికి 57 మొక్కలను నాటాల్సి ఉంటుందని, ఒక్కో మొక్కకు రైతు కేవలం రూ.20వేలు చెల్లించాలని తెలిపారు. ఈ పంట సాగు చేసిన నాలుగో సంవత్సరం నుంచి దిగుబడులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలో నాలుగు టన్నుల నుంచి ఆరు టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ప్రభుత్వం టన్ను ధర రూ.20,800 ఉందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్ పాల్గొన్నారు.





అభివృద్ధి పనులపై చర్చించిన 'కడా' ప్రత్యేకాధికారి

దౌల్తాబాద్, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాంకి, దేశాయిపల్లి, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పర్యటించారు. నాయకులతో కలిసి గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. పనులపై నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ఆయనతో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకట్రావ్, నాయకులు, స్థానికులు ఉన్నారు.



పనులపై స్థానికులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి


















వికారాబాద్ ఆర్టీసీ డిపోకు 16 బస్సుల కేటాయింపు : స్పీకర్ ప్రసాద్‌కుమార్



వికారాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ ఆర్టీసీ డిపోకు కొత్తగా 16 బస్సులను కేటాయించామని అసెంబ్లీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో మహిళల ఉచిత ప్రయాణంతో బస్సుల్లో రద్దీ పెరిగిన నేపథ్యంలో అదనపు బస్సులను కేటాయించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కోరగా 16 కొత్త బస్సులను మంజూరు చేశారని తెలిపారు. మంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నట్టు స్పీకర్ పేర్కొన్నారు.

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి

కందుకూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఓటరుగా నమోదవడం అనేది నిరంతర ప్రక్రియ అని, 18ఏళ్లు నిండిన వారు, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి వెళ్లిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కందుకూరు ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నియోజకవర్గ ఎన్నికల సంఘం డిప్యూటీ తహసీల్దార్ శేఖర్‌తో కలిసి ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5,67,417మంది మంది ఓటర్లున్నట్టు చెప్పారు. ఓటరుగా నమోదయ్యేందుకు 18ఏళ్లు నిండిన ప్రతీ భారత పౌరుడు అర్హుడేనన్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరం మేరకు కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, చనిపోయిన వారి, డబుల్ ఓట్లను తొలగించాలని నాయకులు ఆర్డీవోను కోరారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, యాదయ్య, లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల్లో సంస్కరణలు



తాండూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సోమవారం ప్రీ ఫైనల్స్ ముగియడంతో యాన్యువల్ ఎగ్జామ్‌కు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. సెకండరీ విద్యా బోర్డు ఈ విద్యా సంవత్సరం నుంచి పరీక్ష విధానంలో కొన్ని మార్పులు చేసింది. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు సెకండరీ బోర్డు పరీక్షలు కొనసాగుతాయి.

24 పేజీలతో జవాబు పత్రాల బుక్‌లెట్

ఇప్పటి వరకు జవాబులు రాసేందుకు విడిగా పత్రాలు ఇచ్చేవారు. ఈ సారి నుంచి ఆన్సర్లు రాసేందుకు 24పేజీల బుక్‌లెట్‌ను ప్రభుత్వం ఇస్తుంది. దీంతో అడిషనల్ ఆన్సర్ షీట్లు తీసుకునే అవసరం ఉండదు. అలాగే ఎగ్జామ్ సెంటర్లలోకి రిస్ట్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను నిషేధించిన నేపథ్యంలో పరీక్ష సమయంలో టైంను తెలుసుకునేందుకు హాల్/రూమ్‌లో గోడ గడియారాలు పెడతారు. ఓఎంఆర్ బార్ కోడింగ్ విధానాన్ని అన్ని పేపర్లకు అమలు చేస్తారు. అన్సర్ బుక్‌లెట్లో విద్యార్థి వివరాలన్నీ బార్ కోడింగ్‌తో ఫిలప్ చేయిస్తారు. విద్యార్థులు ఎక్కడా నేలపై కూర్చొని పరీక్ష రాయకుండా ప్రతీ సెంటర్లో డెస్కులు/బెంచీలు తప్పక ఏర్పాటు చేస్తారు. వాటిని సమకూర్చే పనిలో ఎంఈవోలు ఉన్నారు.

లబ్ధిదారులకు పొజిషన్ చూపకుంటే ఆక్రమిస్తాం




సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

ఇబ్రహీంపట్నం, మార్చి 18(ఆంధ్రజ్యోతి):నాగన్‌పల్లి పరిధిలో రామోజీ ఫిలింసిటీ వద్ద పేదలకిచ్చిన ఇళ్ల పట్టాలకు వెంటనే పొజిషన్ చూపకుంటే పేదలతో కలిసి భూమిని ఆక్రమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య అన్నారు. మంగళవారం రాయపోల్‌లో ఇళ్ల పట్టాదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2007లో ప్రభుత్వం నాగన్‌పల్లి, పొల్కంపల్లి, రాయపోల్, ముకునూరు గ్రామాలకు చెందిన 570 మందికి ఇళ్ల పట్టాలివ్వగా ఆ భూముల్లోకి వెళ్లకుండా ఫిలింసిటీ యాజమాన్యం అడ్డుకుంటోందన్నారు. రెవెన్యూ, జిల్లా అధికారులకు ఎన్ని వినతిపత్రాలిచ్చినా స్పందన లేదన్నారు. మరో వారంలో పొజిషన్ చూపకుంటే పేదలతో కలిసి స్థలాలను ఆక్రమిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రామోజీ ఫిలింసిటీ ఇళ్ల స్థలాల పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పంది జగన్, కో-కన్వీనర్ బుగ్గ రాములు, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. సీపీఎం నాయకు లు బి.సామేల్, జంగయ్య, నర్సింహ, విజయ తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

యాచారం: ఫార్మాసిటీకి వందలాది ఎకరాల భూములు తీసుకోవడం దారుణం అని, రైతులను ఆదుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య అన్నారు. యాచారం మండల సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్దల్లో రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న మేడిపల్లిలో జరిగే సభలో సీపీఎం జాతీయ నాయకుడు తమ్మినేని వీరభద్రం పాల్గొంటారని, 28న కలెక్టరేట్ వద్ద జరిగే సభలో రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పాల్గొంటారన్నారు. మొండిగౌరెల్లిలో 821ఎకరాలకుపైగా సేకరించేందుకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నర్సింహ, బ్రహ్మయ్య, అంజయ్య, ధావునాయక్, జంగయ్య, జగన్, చందు



బీసీ రిజర్వేషన్ బిల్లు సాహసోపేత నిర్ణయం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో బీసీ డిక్లరేషన్‌ను ఆమోదించడం సాహసోపేత నిర్ణయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కామారెడ్డి సభలో కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను రెడ్డి సామాజికవర్గ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదింపజేయడం చారిత్రక నిర్ణయమన్నారు. డిక్లరేషన్ చట్టబద్ధతకు పార్లమెంట్‌లో బీజేపీ సహకరిస్తుందని శంకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు జనాభాలో 2శాతం ఉన్న వారు దేశాన్ని, 7శాతం ఉన్న వారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను, 0.5శాతం ఉన్న వారు తెలంగాణ రాష్ట్రాన్ని ఏలి బీసీలకు చిన్న చిన్న పదవులు, పథకాల ఆశ చూపి అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, ఉద్యోగాలు, రాజకీయ పదవుల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందన్నారు.బీసీల్లోని చాలా సంచార జాతులు నేటికీ గూడు, ఊరు లేకుండా వలస బతుకు బతుకు తున్నారని అన్నారు. బీసీ డిక్లరేషన్ అమలుకు ఏమైనా అవాంతరాలెదురైతే తమిళనాడు తరహాలో షెడ్యూల్ 9లో చేర్చి 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు. డిక్లరేషన్‌ను ఆ మోదింపజేసిన ముఖ్యమంత్రికి, మంత్రి ప్రభాకర్‌కు ఎమ్మెల్యే శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు ప్రాధాన్యం

నియోజకవర్గంలో సాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ప్రాధాన్యానిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అసెంబ్లీలో రిజర్వాయర్ అవశ్యకతపై వివరించి నిధులు సాధిస్తానన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కాంసాన్‌పల్లి శివారులో ఏర్పాటు చేసిన గణీకృత పశువీర్య ఉత్పత్తి కేంద్ర అభివృద్ధి, చటాన్‌పల్లి రైల్వే గేటుపై ఆర్వోబీ నిర్మాణం, పరిశ్రమల్లో యువతకు ఉద్యోగాలు, కాలుష్యకారక పరిశ్రమలపై చర్య తీసుకునే అంశాలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని చెప్పారు.

అర్హులందరికీ 'రాజీవ్ యువ వికాసం'

నిరుద్యోగ యువతకు ఉపాధే లక్ష్యంగా రాజీవ్ యువ వికాస పథకాన్ని వర్తింపజేస్తా మని శంకర్ తెలిపారు. మండలాలు, గ్రామాల వారీగా కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశాలను నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలన్నారు. యూనిట్ బేస్డ్‌గా ప్రతీ లబ్ధిదారుకు రూ.50వేల నుంచి 4లక్షల రుణం ఇస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఐదు నుంచి ఆరు వేల మందికి యువ వికాస పథకాన్ని వర్తింపజేస్తామని, మీ-సేవల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

షాద్‌నగర్ డిపోకు 18కొత్త బస్సులు

షాద్‌నగర్ ఆర్టీసీ డిపోకు 18 కొత్త బస్సులను తెస్తున్నామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. డిపో పరిధి ప్రతీ గ్రామానికి బస్సు సర్వీసు కల్పించాలని గతంలో 18 బస్సులను తెచ్చామని, ఇప్పుడు అదనంగా 18బస్సులను తెచ్చేందుకు కృషిచేస్తున్నామన్నారు. షాద్‌నగర్ డిపోకు కావాల్సిన బస్సులు వచ్చాయని, త్వరలో డ్రైవర్, కండక్టర్ల నియామకాలను చేపట్టి, సిబ్బంది సమస్యనూ పరిష్కస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బాబర్‌ఖాన్, దామోదర్‌రెడ్డి, రఘునాయక్, జి.బాల్‌రాజ్ గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, సుదర్శన్ గౌడ్, నర్సింహయాదవ్, హరినాథ్‌రెడ్డి, కె.చెన్నయ్య, బస్వం, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, ఖదీర్, సురేందర్, అశోక్, శ్రీధర్ తదితరులు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్

బొంరాస్‌పేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్‌గా మారనుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన వార్షికోత్సవం, టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి సైకాలజిస్టు డాక్టర్ లక్ష్మణ్, రాజేశ్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా శ్రద్ధతో చదువుతూ మంచి మార్కులు సాధించాలన్నారు. ఏకాగ్రతతో ఇష్టపడి చదివితే విజయాలు సాధించొచ్చని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నారని రాజేశ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే మెడికల్, వెటర్నరీ, నర్సింగ్, ఇంజనీరింగ్, ఐటీఐ కాలేజీలు, స్కిల్ సెంటర్ మంజూరయ్యాయని చెప్పారు. డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు ఏకాగ్రతతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో హరిలాల్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గిరిజన మహిళల వేషధారణలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రజలకు వసతులు కల్పించాలి



ఎమ్మెల్యే పి.సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షాల నాయకులు

కందుకూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయం మేరకు పాలకులు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఫ్యూచర్‌సిటీ అథారిటీ పేరుతో ఏడు మండలాల్లో కొన్ని గ్రామాలను విడదీయడం సరికాదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మంగళవారం తొమ్మిది పంచాయతీల అఖిల పక్షాల నాయకులు నాగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆమెను కలిసి గ్రామాలను ఫ్యూచర్‌సిటీ అథారిటీలో ఉంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వినతిపత్రమిచ్చారు. ఫ్యూచర్‌సిటీ అథారిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. కందుకూరు మండలంలోని 26 పంచాయతీలను అథారిటీలో చేర్చారని, అయితే నేదునూరు, బాచుపల్లి, జైత్వారం, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి, మురళినగర్, పెద్దమ్మతండా, దావుత్‌గూడతండా పంచాయతీలను అథారిటీలో కలపలేదన్నారు. ఫ్యూచర్‌సిటీ పరిధి అన్ని మండలా గ్రామాలన్నింటినీ అథారిటీలో కలిపాలని సబిత అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో అఖిలపక్షాల నాయకులు కాసు రామక్రిష్ణారెడ్డి, యాలాల శ్రీనివాస్, బుడ్డీరపు శ్రీనివాస్, ఎస్.బాల్‌రెడ్డి, ఎ.కుమార్, దామోదర్‌గౌడ్, పాండు, ఎగిరిశెట్టి నరేశ్, వెంకటయ్య,కొంతం లింగారెడ్డి, రూప్‌చందర్, రాఖేష్‌గౌడ్, ఢిల్లీ శ్రీధర్, సురేష్, కె.వెంకటేశ్, బావిరెడ్డి, ఎస్.వెంకటేశ్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, గణేశ్, మనోహర్ పాల్గొన్నారు.

గ్రామాలన్నింటినీ ఫ్యూచర్ సిటీలో కలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ రఘుపతి

మహేశ్వరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రూపొందిస్తున్న ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలనూ విలీనం చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మహేశ్వరంలోని కర్నాటి కళాభవన్‌లో వారు సమావేశమయ్యారు. ఫ్యూచర్‌సిటీ ఉద్యమ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు, ఎయిర్‌పోర్టుకు, ఫ్యూచర్‌సిటీకి సమీపంలో ఉన్న మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో కలపాలనాన్నారు. తుమ్మలూరు, మొహబ్బత్‌నగర్‌లను మాత్రమే ఫ్యూచర్‌సిటీలో కలిపిన ట్టు ప్రభుత్వం ప్రకటించిదని, మరి మిగతా గ్రామాల సంగతేందని ప్రశ్నించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్‌లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మహేశ్వరానికి దేశ వ్యాప్తంగా పారిశ్రామిక, ఇతర రంగాల్లో పేరున్నా మారుమూల గ్రామంగానే ఉందన్నారు. మహేశ్వరం నుంచి రోజుకో ప్రభుత్వ కార్యాలయం వేరేచోటకు తరలుతోందన్నారు. ఫ్యూచర్‌సిటీలో మహేశ్వరాన్ని విలీనం చేస్తేనే ప్రగతి సాధ్యం అన్నారు. లేదంటే అఖిలపక్షాల కార్యాచరణ మరింత ఉధృతం చేస్తూ ముందుకు వెళ్తామన్నారు. ఈ సమావేశంలో ఆయా పార్టీల నాయకులు మల్లేష్‌యాదవ్, కర్నాటి మనోహర్, కె.జంగయ్యయాదవ్, కాకి ఈశ్వర్, టి.యాదీష్, కంది రమేష్, నర్సింహయాదవ్, యాదయ్యగౌడ్, అంజనేయులు, రవి, శివ, సురేష్, దత్తునాయక్, దేశ్య, సుదర్శన్, శ్రావణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం బీసీల పక్షపాతి

పరిగి, మార్చి 18(ఆంధ్రజ్యోతి):సీఎం రేవంత్‌రెడ్డి బీసీల పక్షపాతి అని బీసీ సం క్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్ అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో అమోదం పొందడతో మంగళవారం పరిగిలోని రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కె.హన్మంతు ముదిరాజ్, నాయకులు పి.చిన్ననర్సింహులు, ఆనంద్‌గౌడ్, ఆంజనేయులు, జింకల యాదయ్య, అక్బర్‌సేట్, కె.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



మార్కెట్ కమిటీ నూతన సభ్యులతో ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మార్కెట్ చైర్‌పర్సన్‌గా గోవిందమ్మగోపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్ కార్యాలయంలో మంగళవారం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎండీ.రియాజ్ చైర్‌పర్సన్‌ను, వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, ప్రశాంత్, యాదిరెడ్డి, సుశీల, శ్రీహరి, మల్లేశం, సర్తాజ్, కిషన్, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సంతోష్‌లతో ప్రమాణం చేయించారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి పాలకవర్గం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, శంకర్‌పల్లి సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఐశ్వర్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ యోగేష్, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, నాయకులు ప్రకాశ్, గోపాల్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, గోపాల్, పాండురంగారెడ్డి ఉన్నారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

'తీరని అన్యాయం చేసిన ఎమ్మెల్యే'

శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి తన సతీమణి సునందకు ఇవ్వకుండా ఎమ్మెల్యే యాదయ్య తనకు తీరని అన్యాయం చేశారని శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. తన స్వగ్రామం కొండకల్‌లోని భూముల విషయంలో రైతుల కోసం తాను పోరాటం చేయడం వల్లే పదవి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కూడా కొండకల్‌తండాకు వెళ్లి రైతుల దీక్షలో పాల్గొంటే తప్పు లేదా? అని ప్రశ్నించారు. తన కుటుంబీకులు, కార్యకర్తలతో చర్చించి పార్టీలో ఉండాలా? లేదా అనేది నిర్ణయించుకుంటానన్నారు. నాయకులు ఉదయ్‌మోహన్‌రెడ్డి ఏఎంసీ డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, ప్రశాంత్, యాదిరెడ్డి, కిషన్‌నాయక్, సుశీల పాల్గొన్నారు.

విద్యార్థులు భావిపౌరులుగా ఎదగాలి



మాట్లాడుతున్న డీఈవో

కొత్తూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భావి పౌరులుగా ఎదుగాలని రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు అన్నారు. కొత్తూర్‌లోని ఉన్నత పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో అంగోర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. పాఠశాలల్లో అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. టెన్త్ పరీక్షలు బాగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, కమిషనర్ బాలాజీ, వైస్‌చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి సహకరించాలి

షాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సహకార సంఘం అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. షాబాద్ సొసైటీ ఆవరణలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్యాక్స్ చైర్మన్ శేఖర్‌రెడ్డి లావాదేవీలు, గోల్డ్‌లోన్, ఎల్టీ లోన్ వివరాలు తెలిపారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశామన్నారు. సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్, నర్సింహులు, గోపాల్‌రెడ్డి, రాజరత్నం, దేవేందర్‌రెడ్డి, సీఈవో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లావణ్య, వైస్‌చైర్మన్ రవీందర్

కొత్తూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కొత్తూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందని మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లావణ్యదేవేందర్‌యాదవ్, వైస్‌చైర్మన్ జోలి రవీందర్ అన్నారు. స్థానికంగా ఉన్న ఓ రిసార్ట్‌లో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య హయాంలో కొత్తూర్-కుమ్మరిగూడ రోడ్డుకు రూ.32కోట్లు, కొత్తూర్-జేపీ దర్గా రోడ్డుకు రూ.18కోట్లు మంజురయ్యాయని చెప్పారు. ఇటీవల ఎమ్మెల్యే శంకర్ కుమ్మరిగూడ రోడ్డు పనులు ప్రారంభించి, కాంగ్రెస్ పాలనలోనే నిధులొచ్చాయని చెప్పడం అబద్ధం అన్నారు. పనులు ప్రారంభించిన రోడ్లనే మళ్లీమళ్లీ పనులు ప్రారంభిస్తూ మాజీ ఎమ్మెల్యేపై బురదజల్లుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మున్సిపాలిటీకి రుపాయి కూడా రాలేదన్నారు. తిమ్మాపూర్-చేగూర్, పెంజర్ల, జేపీ దర్గా,తీగాపూర్ గ్రామాలకు డబుల్ రోడ్లను గత ప్రభుత్వంలోనే వేశామన్నారు. 3.5కోట్లతో మున్సిపల్ ఆఫీసు కట్టామన్నారు. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి అభివృద్ధి చేసి చూపాలన్నారు. వీరి పాలనలోని పనులను ప్రజలు గమనిస్తున్నారని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు ఓర్వడం లేదన్నారు. ఎవరెన్ని నిధులు తెచ్చారో.. ఎవరెంత చేశారో బహిరంగ చర్చకు తాము సిద్ధం అని సవాల్ విసిరారు. కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, చంద్రకళరాజేందర్‌గౌడ్, మాధవిగోపాల్‌గౌడ్, నాయకులు రాజేందర్‌గౌడ్, శివచారి, రవి, వెంకటేశ్, శ్రవణ్, ఓంప్రకాశ్ చారి, లక్ష్మయ్య, రాఘవేందర్ పాల్గొన్నారు.

ఈసారైనా..!

(ఐదో పేజీ తరువాయి)

పనులు కూడా మొదలు పెట్టింది. ఈ ప్రాజెక్టు ఆరంభించి దశాబ్దం దాటినా ఉమ్మడి జిల్లాలో వీటి పనులేమీ మొదలు కాలేదు. ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి జిల్లాలో 2.7లక్షల ఎకరాలకు నీరందించొచ్చు. తాగునీటికి ఢోకా ఉండదు. గత బడ్జెట్‌లోనూ అరకొర నిధులే కేటాయించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అత్యంత ప్రాధాన్యమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు చెప్పినా గతంలో రూ.2వేల కోట్లే కేటాయించారు. ఆ నిధులూ పూర్తిగా విడుదల కాలేదు. అలాగే పేదలకు అందిస్తు న్న పెన్షన్లు రూ.4వేలకు మించి పెంచుతామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. గతంలో పెన్షన్లు పెంచలేదు. ఈ సారైనా పెంపునకు నిధులిస్తారా? లేదా అనేది చూడాలి.

శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణం..

నగర శివార్లలో అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండేలా శాటిలైట్ టౌన్‌షిప్‌లు నిర్మిస్తామని గత బడ్జెట్‌లో పేర్కొన్నారు. తక్కువ ధరలకే పేద, మధ్య తరగతి వర్గాలకు నివాస గృహాలు నగరం చుట్టూ నిర్మిస్తామని తెలిపారు. కానీ దీనికి సంబంధించి ఇంత వరకు పెద్దగా అడుగులు పడలేదు.

రోడ్లు, మౌలిక సదుపాయాలకు నిధులిచ్చేనా?

ప్రభుత్వం నిర్మిస్తున్న ఫ్యూచర్‌సిటీ నిర్మాణ పనులకు ప్రభుత్వం దండిగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. దీనిపై ప్రత్యేక దృష్టిసారించిన సర్కార్ ఇటీవల అథారిటీనీ ఏర్పాటు చేసింది. ఈ బడ్జెట్‌లో ఫ్యూచర్ సిటీలో అంతర్గత రోడ్ల నిర్మాణాలు, ఇతర సదుపాయాలకు నిధులు కేటాయించే పరిస్థితి కన్పిస్తోంది. రీజినల్ రింగురోడ్డు విషయంలోనూ స్పష్టత రావాల్సి ఉంది. ఉత్తర భాగం నిర్మాణానికి కేంద్రం ముందుకు వచ్చింది. దక్షిణభాగం రింగురోడ్డుపై స్పష్టత రాలేదు. గత బడ్జెట్‌లో ట్రిపుల్‌ఆర్‌కు రూ.1,525 కోట్లు కేటాయించారు. ఈ నిధులు భూసేకరణకు ఖర్చుచేస్తున్నారు. ఈ బడ్జెట్‌లో మరింత స్పష్టతొచ్చే అవకాశం ఉంది. మూసీ రివర్ ఫ్రంట్‌కు రూ.1,500 కోట్లు కేటాయించినా పనులు ముందుకువెళ్లలేదు. నగర శివారు ప్రాంతాలను మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. రింగురోడ్డు లోపలి భాగాన్ని అర్బన్ జోన్‌గా, రింగు రోడ్డు, రీజినల్ రింగురోడ్డు మధ్య భాగాన్ని పెరి అర్బన్‌గా, రీజినల్ రింగురోడ్డు బయట రూరల్ జోన్‌గా విభజిస్తామన్నారు. దీంతో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల పరిధిలోని పలు గ్రామాలు పెరి అర్బన్ పరిధిలోకొస్తాయి. దీంతో ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. వీటికి ఇంత వరకు కేటాయింపుల్లేవు.

సొంతింటి కల నెరవేరేనా?

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల చొప్పున ఇస్తామని తెలిపింది. ఈ ఏడాది ఒక్కో నియోజకవర్గానికి 3,500ఇళ్లు కేటాయిస్తామని గతంలో వెల్లడించింది. పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కానీ ఇప్పటివరకు ఇళ్లు మంజూరు కాలేదు. పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు పంపిణీ చేస్తామని, అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తామని ప్రభుత్వం తెలిపింది. డబుల్ ఇళ్ల పంపిణీ చేసినా ఇంకా కొన్ని పెండింగ్‌లోనే ఉన్నాయి.

మేడ్చల్ జిల్లాలో ఎన్నో పెండింగ్ సమస్యలు

మేడ్చల్ జిల్లాలో పది వేల ఎకరాల్లో రూ.450కోట్లతో ఉద్యానపంటల హబ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై కదలిక లేదు. ఈ బడ్జెట్‌లోనైనా నిధులిస్తారా? అనే ఆశతో జిల్లావాసులు ఉన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలకు నిధులు విడుదలచేయక పనులు నిలిచిపోయాయి. జిల్లాలో 2,350 ఇళ్లు మంజూరు కాగా, 680 పూర్తయ్యాయి. నిధుల్లేకే నిలిచాయి. జిల్లాలోని 13మున్సిపాలిటీల పరిధిలో 13 సమీకృత మార్కెట్ల నిర్మాణానికి రూ.39.9 కోట్లు మంజూరు చేశారు. నిధులు పూర్తిగా విడుదల చేయక పనులు కాలేదు. పదేళ్ల కిందట ప్రారంభించిన ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ పనులు నిలిచిపోయాయి. ఘట్‌కేసర్‌లో రోడ్లు దెబ్బతిని వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, ప్రభుత్వ ఆస్పత్రుల స్థాయి పెంపుపై పాలకులు ఇచ్చిన హామీలు ఇంత వరకు నెరవేరలేదు.

వికారాబాద్ దశ మారేనా?

రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రవేశపెట్టే బడ్జెట్‌పై వికారాబాద్ జిల్లా ప్రజలు భారీ ఆశలే పెట్టుకున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వాలు బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధికి ఎలాంటి ప్రత్యేక ప్రకటనా చేయలేదు. ఈసారైనా జిల్లా అభివృద్ధికి దోహదపడేలా నిధులు కేటాయిస్తుందనే ఆశతో ప్రజలున్నారు. కొత్త ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రకటిస్తుందా? మరమ్మతులకు నోచుకోని సాగునీటి వనరులకు నిధులిస్తుందా? పర్యాటక ప్రాంతాల, పారిశ్రామిక, ఉపాధి రంగాల అభివృద్ధికి ఏం చర్యలు తీసుకోనుంది? అని ఆశలో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ వికారాబాద్ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో బడ్జెట్‌లో జిల్లాకు పెద్దపీట వేయాలని కోరుతున్నారు.

కొడంగల్‌పై ప్రత్యేక దృష్టి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లో సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ సమగ్రాభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారు.పెండింగ్‌లో ఉన్న కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి, వెటర్నరీ, నర్సింగ్, ఫిజియోథెరపీ కాలేజీల ఏర్పాటు ప్రక్రియా కొనసాగుతోంది. మహాలక్ష్మీ వేంకటేశ్వర ఆలయాన్ని విస్తరించేందుకు మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేశారు. కొడంగల్ మీదుగా వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ ఏర్పాటుపై సీఎం దృష్టి సారించారు. కొడంగల్ ప్రాంత సమగ్రాభివృద్ధికి కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ఏర్పాటు, పనుల పర్యవేక్షణకు అధికారిని నియమించారు. ఇంత కాలం వెనుకబాటుకు గురైన కొడంగల్ నియోజకవర్గాన్ని అన్నిరంగా ల్లో అభివృద్ధి పరచాలన్న పట్టుదలతో రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు.



ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు జరిగేనా..

వికారాబాద్ జిల్లాలో పలు సాగునీటి ప్రాజెక్టులు, చెరువులున్నా మరమ్మతులు, ఆధునికీకరణకు నోచుకోక నిండడం లేదు. జిల్లాలో 1,179 సాగునీటి వనరులుండగా, వీటి కింద 78వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో 20శాతానికైనా నీరందడం లేదు. కోట్‌పల్లి ఒక్కటే ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు. దీని కింద 9,200ఎకరాలు ఉన్నా వెయ్యి ఎకరాలకైనా నీరందడం లేదు. ప్రాజెక్టు పనులకు నిధులు మంజూరైనా ముందుకు సాగడం లేదు. నందివాగు, జుంటుపల్లి, సర్పన్‌పల్లి, కొంశెట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టుల పరిస్థితి కూడా అలాగే మారింది. మరమ్మతులకు కూడా నిధుల్లేక నిర్వహణ అస్తవ్యస్థంగా మారింది. కాలువల్లో పెరిగిన మొక్కలనైనా తొలగించడం లేదు. కాలువలు, తూములు, గేట్ వాల్వ్‌లకు మరమ్మతులు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే కొంత భూమికైనా నీరందుతుంది. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు, ఆధునీకరణ పనులకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనైనా కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

అనంతగిరికి పర్యాటక శోభ తెచ్చేనా?

ప్రకృతి సౌందర్యానికి నిలయమైన అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం ముందుకు సాగడం లేదు. అనంతగిరిని ఎకో టూరిజంగా, టెంపుల్ టూరిజం, వెల్నెస్ టూరిజం, అడ్వెంచర్ టూరిజంగా తీర్చిదిద్దేందుకు అవకాశమున్నా పర్యాటకాభివృద్ధికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వంలో రూపొందించిన ప్రణాళికలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. స్వచ్ఛ దర్శన్ కింద రూ.110కోట్లతో అనంతగిరుల్లో 213ఎకరాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే పనులు కావడం లేదు. అనంతగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. సింగపూర్, మలేషియా దేశాల్లో మాదిరిగా అనంతగిరి కొండలను జంగిల్ రిసార్ట్స్, బటర్‌ఫ్లై పార్క్ ఏర్పాటు, ఎడ్వంచర్ టూరిజంగా అభివృద్ధి పరిచేందుకు అవకాశాలున్నాయి.

మినీ స్టేడియానికి నోచుకోని జిల్లా కేంద్రం

వికారాబాద్‌లో మినీ స్టేడియం ఏర్పాటు కలగా మారింది. ఏ ఆటలు ఆడాలన్నా బ్లాక్ గ్రౌండ్ ఒక్కటే ఉంది. ధన్నారం శివారంలో గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడేళ్లవుతున్నా పనులు ముందుకు సాగడం స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా స్పందన లేదు. క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రకటించే ప్రభుత్వం వికారాబాద్‌లో స్టేడియం నిర్మాణానికి నిధులు ఇవ్వాలని క్రీడాకారులు కోరుతున్నారు. స్టేడియానికి అనుబంధంగా జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. వికారాబాద్‌లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలన్న ప్రజల డిమాండ్‌పై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కోస్గిలోని పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లుగానే కొంపల్లిలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత విద్యార్థులు కోరుతున్నారు. నాపరాతి పరిశ్రమకు పేరొందిన తాండూరులో మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వచ్చినా ఇంజనీరింగ్ కళాశాలలు లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ పరంగా జిల్లాలో ఇంజనీరింగ్, మైనింగ్ కళాశాలల ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విశ్వవిద్యాలయం సాకారమయ్యేనా?

జిల్లాలో ఉన్నత చదువులన్నీ ఒకే గొడుగు కింద అందుబాటులోకి వచ్చేలా వికారాబాద్‌లో గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని గత 20ఏళ్లుగా ఈ ప్రాంత విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. వివిధ కోర్సుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు స్థానికంగా లేక విద్యార్థులు హైదరాబాద్‌కు వెళుతున్నారు. యూనివర్సిటీని ఏర్పాటుచేస్తే అన్ని కోర్సులూ జిల్లా విద్యార్థులకు అందుబాటులోకొచ్చే అవకాశం ఉంటుంది.

జిల్లాలో కరెంట్ కోతలు లేవు

● విద్యుత్ శాఖ ఎస్ఈ రవిప్రసాద్



వికారాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా విద్యుత్ అంతరాయ సమస్యలు లేవని విద్యుత్ ఎస్ఈ ఎస్.రవిప్రసాద్ తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ప్రజలు అవాస్తవాలను నమ్మవద్దని సూచించారు. ధారూరు మండలం పీసీఎం తండా గ్రామంలో విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని ఓ దినపత్రికలో విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని ప్రచురితమైందని, ఆ వార్తలో వాస్తవం లేదని ఎస్ఈ స్పష్టం చేశారు. జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతోందని, అవసరమైన సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో డీఈ సంజీవ్, ఏడీఈ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పులిపిల్ల కాదు.. అడవి పిల్లి



ట్రాప్ కెమెరాకు చిక్కిన అడవి పిల్లి

తాండూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మల్కాపూర్ అల్ట్రాసిమెంట్స్ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా సంచరిస్తున్నది పులిపిల్ల కాదు.. అడవి పిల్లి అని తాండూరు అటవీ రేంజ్ అధికారి శ్రీదేవిసరస్వతి, సెక్షన్ ఆఫీసర్ పీర్యానాయక్‌లు తెలిపారు. తమ మైన్స్ ఏరియాలో పులిపిల్లలు సంచరిస్తున్నాయని అల్ట్రాసిమెంట్స్ యాజమాన్యం అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోమవారం తాండూరు అటవీ రేంజ్ అధికారి శ్రీదేవిసరస్వతి ఆదేశాల మేరకు సెక్షన్ ఆఫీసర్ పీర్యానాయక్, బీట్ ఆఫీసర్ మల్లయ్యలు సిమెంటు కర్మాగారం సిబ్బందితో కలిసి మైన్స్ ఏరియాలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం వేళ ఓ అడవిపిల్లి నీటిని తాగేందుకు సిమెంట్స్ ఏరియాలో తిరుగుతున్న దృశ్యాలు ట్రాప్-3 కెమెరాలో నమోదయ్యాయి. సీసీ ఫుటేజీని పరిశీలించిన శ్రీదేవిసరస్వతి తిరుగుతున్నది పులి కాదని, అడవి పిల్లి గుర్తించారు. ఈ ఫుటేజీని ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎల్వోసీ అందజేత

యాలాల, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజాపూర్ గ్రామానికి చెందిన హరిజన అమృతమ్మ అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అమృతమ్మ చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే మంగళవారం రూ.1లక్ష 50వేల విలువైన ఎల్‌వోసీని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

పాంబండ దర్శనం.. పాప వినాశనం

● నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

కులకచర్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పాంబండ రామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటే పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. దక్షిణ కాశీ రామేశ్వరంగా పేరొందిన కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల ఏకశిల పర్వతం పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి జాతర ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య తెలిపారు.

ఉత్సవ కార్యక్రమాలు

ఈ నెల 19న గణపతి హోమం, ధ్వజారోహణం, సాయంత్రం స్వామివారి ఊరేగింపుతో గుట్టపైకి వచ్చుట, 20న శకటోత్సవం, పల్లకీసేవ, హారతి, 22, 23న పల్లకీసేవ, హారతి, 24న పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం, రాత్రికి రథోత్సవం, 25, 26, 27 తేదీల్లో హారతి, ప్రత్యేక కార్యక్రమాలు, 28న అగ్ని గుండాలు, 29న సర్వే దర్శనం, 30న నూతన తెలుగు కొత్త సంవత్సరం, ఉగాది సాయంత్రం స్వామివారు గ్రామానికి వెళ్లుట కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి



ఇలా చేరుకోవచ్చు

పరిగి, పాలమూర్ నుంచి బస్సులో కులకచర్ల చేరుకోవాలి. ఇక్కడి నుంచి ఆటోలోనైనా, కాలినడకన పాంబండ చేరుకోవచ్చు. ప్రభుత్వం పాంబండను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



రామలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. రథోత్సవం, అగ్ని గుండాల రోజు భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో ఆలయ అభివృద్ధి చేపడుతున్నాం.

- కోట్ల మైపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్

పేదల పక్షపాతి హరీశ్వర్‌రెడ్డి

పరిగి,మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ డిప్యూటీ స్పీకర్ కె.హరీశ్వర్‌రెడ్డి పేదల పక్షపాతి అని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. హరీశ్వర్‌రెడ్డి 78వ జయంతి వేడుకను పరిగిలో ఘనంగా నిర్వహించారు. హరీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. హరీశ్వర్‌రెడ్డి పేరిట అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిగి మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఎం.అశోక్, కె.నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, సురేందర్, హరీశ్వర్‌రెడ్డి సతీమణి గిరిజాదేవి, అనిల్‌రెడ్డి, అర్చన పాల్గొన్నారు.



హరీశ్వర్‌రెడ్డి జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

తాగునీరు వృథా!



గ్రామంలో వృథాగా పోతున్న నీరు

దుద్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లిలో తాగునీరు వృథాగా పోతోంది. . పాఠశాల సమీపంలో ఉన్న బోరులో నీరు పుష్కలంగా ఉన్నా వృథాగా పోతున్నాయి. ఒకవైపు ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య ఇలా ఉంటే ఇక రాబోయే రోజుల్లో ఎలా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి కోసం కుళాయిల దగ్గర మహిళలు కొట్లాడే పరిస్థితి ఏర్పడింది. మండుతున్న ఎండలకు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోర్లలో నీటి మట్టం తగ్గుముఖం పట్టాయిఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కోట్‌పల్లి, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మజీదులో స్థానిక మాజీ సర్పంచ్ నక్కల విజయలక్ష్మి, మంగళవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంజయ్య, బందయ్య, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఘనంగా మారియమ్మ బోనాలు



బోనాల ఉత్సవాల్లో తమిళులు

కీసర, మార్చి18 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం కరు మారియమ్మ బోనాల పండుగ ఘనంగా జరిగింది. గత కొన్నేళ్లుగా కీసరలో నివాసముంటున్న తమిళులు మంగళవారం కరు మారియమ్మకు బోనాల పండుగ నిర్వహించారు. ఈమేరకు ఉదయం కుటుంబసభ్యులంతా ఉపవాస దీక్షలతో అమ్మవారికి ప్రీతికరమైన బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి మారియమ్మకు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి

మోమిన్‌పేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి కృత నిశ్చయంతో నిరుద్యోగ యువత కోసం స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చారని మర్పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాజీవ్ యువవికాసం పథకంతో రాష్ట్రంలోని నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

తాండూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో తాండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు నెలవారి వేతనం రూ.18వేలకు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. నేడు(బుధవారం) నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి ఆశా వర్కర్లంతా పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రేణుక, లలమాదేవి, ఆశ వర్కర్లు అనంతమ్మ, రాములమ్మ అరుణ పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: ఆశాకార్యకర్తల హక్కుల సాధనకు అనుమతులు మంజూరు చేయాలని ఆశాకార్యకర్తలు కోరారు. ఈ మేరకు మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ నెల 17న ఎల్‌సీడీసీ సర్వేను 24 తరువాత కొనసాగించేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మ, కవిత, మంజుల, జ్యోతి, బాలమణి, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం అభినందనీయం

ఘట్‌కేసర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బీసీ కులసంఘాల జేఏసీ కన్వీనర్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం నగరంలో సీఎంను కలిసిన నాయకులు బీసీ కులగణన పూర్తి చేసి బీసీ బిల్లును అసెంబ్లీలో ఆమోదం పొందడం వల్ల బీసీ కులాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

కులకచర్ల: సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించడం అభినందనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని పేర్కొన్నారు.

కొడంగల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ సోమవారం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమని బీసీ సంఘం కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు బస్వరాజ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పట్ల హర్షం వ్యక్తం చేశారు.

సంక్షిప్తంగా..

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులు

బొంరాస్‌పేట్/దుద్యాల: బొంరాస్‌పేట్ మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన దేవమ్మ, బాలయ్య కుమారుడు రాజయ్య సోమవారం విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో ఉద్యోగం సాధించాడు. అదే విధంగా ఏర్పుమళ్ల గ్రామానికి చెందిన బాపల్లి దేవమ్మ, రాములు కుమారుడు బాపల్లి నర్సింహులు చార్మినార్ జోన్ పరిధిలో 41వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 400వ ర్యాంకు సాధించాడు. అదేవిధంగా దుద్యాల మండల కేంద్రానికి చెందిన మాసుల శశివర్ధన్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాడు.

క్రీడాకారుడికి నగదు ప్రోత్సాహకం

దుద్యాల: మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన అల్వాల్ సాయికిరణ్ జాతీయ స్థాయి షార్ట్‌పుట్ క్రీడాకారుడిగా కొంత కాలంగా పలు ఈవెంట్లలో రాణిస్తున్నాడు. గతంలో రాణించిన విజయాలను దృష్టిలో పెట్టుకొని నెల్టాక్ పాఠశాల, ఇన్నింగ్స్-2 ఐటీ కంపెనీ హైదరాబాద్ వారు సాయికిరణ్‌కు మంగళవారం రూ.20వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. హస్నాబాద్‌కి చెందిన ప్రముఖ రాజకీయ వేత్త చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి చేతుల మీదుగా నగదును అందజేశారు.

ఇసుక వేలం

బొంరాస్‌పేట్: దుప్‌చర్ల గ్రామ శివారులో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను అధికారులు సీజ్‌చేయగా మంగళవారం 15ట్రాక్టర్ల ఇసుకను ఆర్ఐ శిరీష ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. దుప్‌చర్లకు చెందిన పట్లోళ్ల శ్రీనివాస్‌రెడ్డి వేలంలో పాల్గొని రూ.29,500కు ఇసుకను దక్కించుకున్నాడు.

పాఠశాలకు వెలుగులు

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల నిధులు రూ.60వేలతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్‌లైట్లను మంగళవారం ప్రారంభించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడి నియామకంపై హర్షం

మోమిన్‌పేట్: బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించడంతో బీజేపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి బేలూరి రవీందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

కొడంగల్: రావుల్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మున్సిపల్ మాజీ ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి మంగళవారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

బొంరాస్‌పేట్: బాపల్లి తండాకు చెందిన మోతిబాయికి మంజూరైన రూ.50వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ సర్పంచ్ మోత్యానాయక్, కాంగ్రెస్ నాయకులు మహేందర్‌సింగ్, హన్మ్యానాయక్ మంగళవారం అందజేశారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

పెద్దేముల్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో సీసీరోడ్డు పనులు ప్రారంభమయ్యాయని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు పి.మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రుద్రారం గ్రామంలో మంగళవారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

తాండూరు రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. ఐనెల్లి శివారులోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో కళాశాల మంగళవారం విద్యార్థులకు నేనుసైతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన విఠల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులు భయాందోళనకు గురికావద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

దుద్యాల: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎంఈవో విజయరామారావు అన్నారు. దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, మల్లప్ప, రమేశ్‌యాదవ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం

దుద్యాల: మండలంలోని పోలెపల్లి శ్రీ గాయత్రి పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమేశ్‌గౌడ్, ఉపాధ్యాయులు జ్యోతి, సావిత్రి, లావణ్య, వీరమణి, సంగీత, శిరీష, మమత, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పెస్టిసైడ్స్ డీలర్లకు శిక్షణ

పూడూరు: మండల కేంద్రంలో పెస్టిసైడ్ డీలర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూడూరు రైతు వేదికలో మంగళవారం పురుగు పెస్టిసైడ్ డీలర్లకు స్టాక్ ఎంట్రీ, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిగి డివిజన్ సహాయ సంచాలకులు లక్ష్మీకుమారి, మండల వ్యవసాయాధికారులు, విస్తీర్ణాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

తాండూరు రూరల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తాండూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వడ్డె శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అంతారం గ్రామంలో మంగళవారం నూతన రేషన్ కార్డు పొందిన వారికి కొత్తగా మంజూరైన బియ్యాన్ని అందజేశారు. గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.10లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

ధారూరు: మండలంలోని మోమిన్‌కలాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ వీడ్కోలుసమావేశంలో ప్రధానోపాధ్యాయుడు బసిరెడ్డి మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షలను బాగా రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. అదేవిధంగా తరిగోపుల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ టౌన్: పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ యాదవ్ అన్నారు. వేసవి కాలం దృష్ట్యా మేడ్చల్ మున్సిపల్ పరిధిలో నెల కొన్న మంచినీటి ఎద్దడి నివారణలో భాగంగా మండలంలోని ఘనాపూర్ మిషన్ భగీరథ రిజర్వాయర్‌ను కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, డీఈఈ విజయ లక్ష్మీతో కలిసి సందర్శించారు. రిజర్వాయిర్‌లో నిలువ ఉన్న నీటి సామర్థ్యం గురించి మిషన్ భగీరథ అధికారులతో కలిసి చర్చించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఓ మహిళ మృతిచెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలీకి చెందిన మీర్జా హైదర్ అలీ తన భార్య నసీనా ఫాతిమా(36)తో కలిసి యాదాద్రి-భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం, కొండమడుగులోని దర్గాకు మంగళవారం రాత్రి బయల్దేరారు. అవుశాపూర్ సమీపంలోని రాక్ గార్డెన్ వద్దకు రాగానే వెనుకాల నుంచి వచ్చిన మరో బైక్ మీర్జాహైదర్‌అలీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ వెనుకాల కూర్చున నిషాఫాతిమా కిందపడటంతో తలకు తీవ్ర గాయాలు కాగా భర్త స్థానికుల సాయంతో చికిత్స నిమిత్తం భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఫాతిమా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.

ఫంక్షన్‌కు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

కీసర రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఫంక్షన్‌కు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి నగలతో పాటు నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, క్రైమ్ ఎస్ఐ వెంకట్‌నారాయణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బిక్షపతిగుప్త అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి నాగారం మున్సిపాలిటీ రాజ్‌సుఖ్‌నగర్ కాలనీలో నివాసముంటున్నాడు. స్థానికంగా వాటర్ ఫిల్టర్‌ను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా బంధువుల ఇంట్లో ఫంక్షన్ ఉండటంతో కుటుంబసభ్యులతో కలిసి సోమవారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరారు. తిరిగి రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో భద్రపరిచిన రెండు తులాల బంగారు నగలు, అరకిలో వెండి వస్తువులు, రూ.10వేల నగదు కనిపించలేదు. దీంతో ఇంటి ఆవరణలో అమర్చిన సీసీ కెమెరాలు పరిశీలించగా సాయంత్రం 4.30గంటలకే ఇద్దరు దొంగలు మెయిన్‌డోర్ తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడటాన్ని గమనించారు. అనంతరం కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెచ్చిపోతున్న బైక్ దొంగలు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బైక్ దొంగలు రెచ్చిపోతున్నారు. మర్రిపల్లిగూడలో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు రెండు బైక్‌లను అపహరించుకెళ్లారు. మాయ నరేష్ సోమవారం రాత్రి తన బైక్‌ను ఇంటి వరండాలో పార్కు చేశాడు. అదే గ్రామానికి చెందిన మడ్డి సురేష్ బైక్ తన ఇంటి ముందు పార్కు చేశాడు. అర్ధరాత్రి దాటాక ఒకబైక్‌పై ముగ్గురు దుండగులు సురేష్ ఇంటి ముందున్న బైక్ తాళం తీసి ఎత్తుకెళ్ళారు. అక్కడి నుంచి మెయిన్ రోడ్డుపై ఉన్న నరేష్ ఇంటి వరండాలోని బైక్‌ను ఎత్తుకెళ్లారు. కాగా, సురేష్ బైక్‌ను గ్రామంలో కొద్ది దూరంలో వదిలిపెట్టి నరేష్ బైక్‌తో పరారయ్యారు. ఉదయం లేచి చూసే సరికి బైక్‌లు కనిపించకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముగ్గురు దుండగులు బైక్‌ను దొంలిస్తున్న దృశ్యాలు సీసీ పుటేజీలో రికార్డయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్టీల్ దుకాణంలో మంటలు

కీసర, మార్చి 18(ఆంధ్రజ్యోతి) ప్రమాదవశాత్తు స్టీల్ ట్రేడర్స్‌లో మంటలు చెలరేగాయి. ఈ ఘటన కీసరలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కీసర నుంచి కుషాయిగూడకు వెళ్లే దారిలో ఉన్న చర్చి పక్కన ఎల్ఆర్ స్టీల్ షాపులో మధ్యాహ్నం ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన షాపు యజమాని, వర్కర్లు వెంటనే అగ్నిమాపక శాఖకు ఫోన్ చేశారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఘటనలో ఆస్తినష్టం తప్ప, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

వేటకు వలలతో వచ్చిన వాహనం సీజ్



నాగసమందర్ అడవిలో అధికారులు పట్టుకున్న వాహనం

ధారూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అడవి పందులను వేటాడేందుకు వలలు, తీగలతో అడవిలోకి వచ్చిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన వాహనాన్ని మంగళవారం మధ్యాహ్నం అటవీ సిబ్బంది పట్టుకున్నారు. రేంజ్ పరిధిలోని నాగసమందర్ అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా ఓ వాహనం కనిపించింది. అటవీ సిబ్బందిని గమనించిన వేటగాళ్లు వాహనాన్ని వదిలిపెట్టి పారిపోయారు. రేంజర్ రాజేందర్, అటవీ సిబ్బంది వాహనాన్ని తనిఖీచేయగా కర్ణాటకకు చెందినదిగా గుర్తించారు. ఈ వాహనంలో అడవి జంతువులను వేటాడే వలల చుట్టలు, తీగలు ఉన్నాయి. వాహనంలో అడవి పందులు, కుందేళ్ల వేటకు వచ్చినట్లు అనుమానిస్తున్నట్లు రేంజర్ తెలిపారు. కాగా కోట్‌పల్లి సమీపంలోని అన్నాసాగర్‌కు చెందిన ఓవ్యక్తిని పట్టుకున్న అటవీ సిబ్బంది వాహనాన్ని ధారూరు రేంజ్ కార్యాలయానికి తరలించారు. వాహనం ముందు భాగంలో పైన అడవి రాముడు అన్ని రాసి ఉండటం గమనార్హం.

పేకాడుతున్న ఐదుగురిపై కేసు

పరిగి,మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు. పరిగి మునిసిపల్ పరిధిలో గల బహార్‌పేట్‌లోని ముబారక్ వెల్డింగ్‌షాపువెనుకాల పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.9320లు, 52 ప్లేకార్డును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఐదుగురిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్ పరీక్ష రాస్తున్న విద్యార్థినికి ఫిట్స్

కీసర, మార్చి18(ఆంధ్రజ్యోతి): పరీక్ష కేంద్రంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంకు సంబంధించిన పరీక్ష రాస్తున్న విద్యార్థినికి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చింది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా కీసరలో మంగళవారం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకార.. బాలాజీనగర్‌కు చెందిన నరహరి కూతురు ప్రవల్లిక నాగారంలోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. మంగళవారం కీసర శ్రద్ధ కళాశాలలో ఇంటర్ పరీక్ష ఉండగా పరీక్ష కేంద్రం వద్ద తన తండ్రి నరహరి ద్విచక్ర వాహనంపై దించి వెళ్లాడు. ఎకనామిక్స్ పరీక్ష రాస్తుండగానే ప్రవల్లికకు ఫిట్స్ రావడంతో పరీక్ష హాల్‌లోని విద్యార్థులు, ఇన్విజిలేటర్, ఉపాధ్యాయులు వెంటనే పరీక్ష కేంద్రం వద్ద ఉన్న ఏఎన్ఎమ్‌కు సమాచారం అందించారు. ప్రవల్లికకు ప్రాథమిక చికిత్స అందించి కళాశాల ముందున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రవల్లిక తండ్రి నరహరికి, 108కి సమాచారం అందించారు. అనంతరం చికిత్స నిమిత్తం నాచారంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి

ఘట్‌కేసర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు సగ్గు శివ కూమార్ మాదిగ, కేశపాగ రాంచందర్ మాదిగ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ బిల్లు ఆమోదం తెలిపే వరకూ వివిధ గ్రూప్ పరీక్షలను ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.స్వామి, ఎం.నరేందర్, యాదగిరి, కె.మధు, ఎస్.శ్రీనివాస్, బి.శివ తదితరులు పాల్గొన్నారు.